మ్యూజియం భవనానికి గ్రహణం

- దీర్ఘకాలంగా నిలిచిన నిర్మాణ పనులు
- పదేళ్లుగా ప్రారంభానికి ఎదురుచూపులు
- అధికారులు దృష్టి సారించాలని కోరుతున్న పర్యాటకులు


మధ్యకోటలో ప్రారంభానికి నోచుకోని మ్యూజియం భవనం

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్‌లో మనస్సును కట్టిపడేసే ప్రకృతి అందాలు.. పల్లె వాతావరణ సమాహారం.. ఆధ్యాత్మిక పర్యాటకం.. కాకతీయుల శిల్పకళా సౌందర్యం.. అద్భుత కట్టడాలు ఉన్నాయి. పర్యాటక రంగ అభివృద్ధికి అపార అవకాశాలున్నా ఈ ప్రాంతం క్రమేణా నిరాదరణకు గురవుతోంది. పర్యటకం అంటే ఓరుగల్లు వైపు చూసేలా చేస్తామని ప్రభుత్వాలు ప్రగల్భాలు పలికినా క్షేత్రస్థాయిలో మాత్రం పర్యాటకులను ఆకర్శించే వసతుల కల్పనలో వెనుకబడినట్లు చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చరిత్రకారులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు?

కాకతీయుల నిర్మాణాలు, ఆనాటి శిల్పకళా సంపద అందరికి గుర్తుకొస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాకతీయుల మధుర జ్ఞాపకాలు మదిలో నిక్షిప్తమై కనులారా వీక్షించే భాగ్యం కలుగుతుందని కోటి ఆశలతో పర్యాటకులు ఎదురు చూశారు. మ్యూజియం ప్రారంభమవుతుందని ఎన్నో కలలుగన్నారు. తీరా ఆశ నెరవేరకపోవడంతో నిరాశనిస్పృహలకు లోనయ్యారు. కాకతీయుల కళాసంపదను ఒకేచోట భద్రపర్చి భావితరాలకు అందించేందుకు అప్పటి ప్రభుత్వం చేపట్టిన మ్యూజియం నిర్మాణ పనులు పదేళ్లుగా అటకెక్కాయి. స్వరాష్ట్రం ఏర్పడగానే కాకతీయుల కళావైభవాన్ని భావితరాలకు అందించే లక్ష్యంగా 2015 జనవరిలో ఆనాటి పర్యాటక శాఖ మంత్రి దివంగత చందులాల్ చేతుల మీదుగా మ్యూజియం భవన నిర్మాణానికి బీజం పడింది. ఆర్భాటంగా నిర్మాణ పనులను ప్రారంభించిన అధికారులు.. పూర్తి చేయడంలో విఫలం చెందారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పదేళ్లుగా భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మ్యూజియం పూర్తయితే పర్యాటకులకు కోట అందాలతో పాటు అరుదైన జ్ఞాపకాలు దర్శమివ్వనున్నాయని అంతా భావించారు. కానీ భవనం నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదని, మ్యూజియం ప్రారంభానికి నోచుకోలేదని స్థానికులు వాపోతున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక దృష్టి సారించి మ్యూజియం ప్రారంభించి ఉపాధి చూపాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డాగా..

పదేళ్లుగా మ్యూజియానికి పట్టిన గ్రహణం వీడడం లేదు. అర్ధంతరంగా నిల్చిన మ్యూజియం భవన ప్రాంగణం పిచ్చిమొక్కలతోనే దర్శనమిస్తోంది. సరైన భద్రత లేక అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. కోటకు వచ్చే పర్యాటకులు అసంపూర్తిగా కనిపిస్తున్నా భవనాన్ని చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న పర్యాటకులకు అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. జిల్లా యంత్రాంగం దృష్టి సారించి నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని పర్యాటకులు కోరుతున్నారు.

మ్యూజియాన్ని ప్రారంభించాలి



మధ్యకోటలో నిర్మించిన మ్యూజియం భవన ప్రాంగణం పిచ్చిమొక్కలతో కళావిహీనంగా కనిపిస్తోంది. ప్రారంభానికి నోచుకోకుండానే భవనం శిథిలమయ్యే పరిస్థితి ఉంది. రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డగా మారి అసాంఘిక శక్తులకు నిలయమైంది. కాకతీయుల శిల్పకళా సంపద, ఆనాటి విలువైన సంపదను పర్యాటకులు వీక్షించేలా తగు చర్యలు తీసుకోవాలి. పదేళ్లుగా ఊరిస్తున్నా మ్యూజియానికి తుది మెరుగులు దిద్ది దసరాకు ప్రారంభించాలి.

– షేక్ బాష్‌మియా, సీపీఐ జిల్లా కార్యదర్శి

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం


హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రవి

హసన్‌పర్తి: క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండల అభివృద్ధి అధికారి రవి అన్నారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు హసన్‌పర్తిలోని పీఎంశ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, కళాశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి చకిలం రాజేశ్వర్‌రావు, సామాజిక వేత్త శీలం యాదగిరి, ఎస్‌జీఎఫ్‌ఐ మండల కార్యదర్శి పార్థసారధి, ఆత్మ జిల్లా మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, పీఈటీలు ప్రభాకర్, వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాపోటీలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఈ పోటీల్లో చైతన్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో, కబడ్డీ సీనియర్ విభాగంలో కిషోర్, జస్వంత్, జూనియర్స్ ఖోఖోలో రుత్విక్, నవీన్, చంద్ర, ధర్మ, నిఖిల్, సౌమ్య, కబడ్డీలో సంకీర్త, జూనియర్ విభాగం వాలీబాల్‌లో సాత్విక్, రేవంత్, సుకృత్, విశాల్ ఎంపికయ్యారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో డీజీఎం చేతన్, కోఆర్డినేటర్లు శివ, కోటేశ్వర్ రావు, పీఈటీ ప్రవీణ్, పీడీ కరుణాకర్, పీఈటీ సుంజు, సుష్మ, హన్విత, తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సులకు పార్కింగ్ స్థలం కేటాయించాలి


కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు సమస్యలు వివరిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: అద్దె బస్సులకు పార్కింగ్ స్థలం కేటాయించాలని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు కోరారు. ఈ మేరకు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను వరగల్ మహానగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లక్కం ప్రభాకర్, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా బస్సులు నిలపడం వలన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. బాలసముద్రంలోని కుడా స్థలం కేటాయిస్తే అక్కడ అద్దె బస్సులను పార్కింగ్ చేస్తామని తెలిపారు.

పత్తి విక్రయానికి పరిమితులొద్దు


మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

వరంగల్ చౌరస్తా: ఆరుగాలం కష్టించి పత్తిని పండిస్తే దాన్ని అమ్ముకునే సందర్భంలో రైతుకు సాధ్యం కాని నిబంధనలు విధించడం శోచనీయమని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్, ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీ ఎత్తివేసి, కుట్రలో భాగంగానే యూరియా కొరత సృష్టించి రైతులకు తీరని నష్టాన్ని చేకూరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ముందస్తు వ్యవసాయ ప్రణాళిక లేకుండా, యూరియా నిల్వలు చేపట్టకుండా రైతుల నష్టానికి కారణమవుతోందని అన్నారు. పత్తి అమ్ముకునే దశలో సీసీఐ, ప్రభుత్వం కలిసి ఫార్మర్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ అంటూ ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర నాయకులు తుకారాం నాయక్, ఇస్మాయిల్, నాగెల్లి కొమురయ్య, సింగతి మల్లికార్జున్, వక్కల కిషన్, మారయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజ ఉన్నతికి ఆలోచనలు దోహదం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: సమాజంలో మాయమవుతున్న మానవీయ విలువలను కాపాడేందుకు తక్కళ్లపల్లి వెంకటరామ నర్సింహరావు (రాము) ఆలోచనా దృక్పథం దోహదపడుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పింజర్లవీధిలోని రాజరాజ నరేంద్ర భాషానిలయంలో రాము సంస్మరణ సభ గురువారం జరిగింది. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, మార్నేని ఉదయ భానురావు అధ్యక్షతన జరిగిన సభలో రాము చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కత్తి వెంకటస్వామి, డాక్టర్ ఎస్.లక్ష్మీప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ అశోక్ రావు, ప్రభాకర్‌రావు, డాక్టర్ కొట్టె భాస్కర్, ముంద్రాతి సురేష్, రాజన్న, క్రాంతికుమార్, వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వెదురు దినోత్సవ శుభాకాంక్షలు

హన్మకొండ: ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో హనుమకొండ మేదరి సంఘం నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వెదురు మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కోరుట్ల రమేష్, కూచనపల్లి దేవేందర్, బొమ్మిడి రమేష్, రవికుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి


పుప్పాలగుట్ట ఆరోగ్య కేంద్రంలో చీపుర్లతో ఊడుస్తున్న రవికుమార్, ప్రదీప్‌రావు, తదితరులు


న్యూశాయంపేట స్వచ్ఛభారత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ఖిలా వరంగల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, పార్టీ నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. ప్రధాని జన్మదినం సందర్భంగా, సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా పుప్పాలగుట్ట పట్టణ ప్రాథమి ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గణేష్, మడిపెల్లి నాగరాజు ఆధ్వర్యంలో వేర్వేరుగా స్వచ్ఛత కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. అలాగే, మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్‌కుమార్, కర్నే రవీందర్, వెంటేష్, కందిమల్ల మహేష్, మహమ్మద్ రఫీ, సాగరిక, బండి సుజాత, నరేష్ పాల్గొన్నారు.

మోదీ జన్మదిన స్ఫూర్తితో స్వచ్ఛభారత్

కాజీపేట అర్బన్: ప్రధాని జన్మదినం స్ఫూర్తితో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా న్యూశాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, ప్రణయ్‌భాస్కర్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, పీజీఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి, ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గ కాలనీ, భవాని నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుమంగళి ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హంటర్ రోడ్డు కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, ఆంజనేయ దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బిజినెస్ అవార్డు ప్రదానం



ఖిలా వరంగల్: స్వయం శక్తితో ఎదిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఇటీవల హైదరాబాద్‌లో ఓ కంపెనీ నుంచి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఈమేరకు గురువారం వరంగల్ శివనగర్‌లోని గోల్డెన్ ఓక్ స్కూల్ ప్రాంగణంలో రవికుమార్‌ను ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ సేవాదళ్ వరంగల్ పశ్చిమ అధ్యక్షుడిగా రాజు



హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజును నియమించినట్లు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా రాజుకు గురువారం నియామక పత్రం అందించారు.

ఐటీఐలో స్కౌట్స్ యూనిట్



కాజీపేట: కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు గురువారం ప్రారంభించారు. యువతలో దేశభక్తితో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించే లక్ష్యంతో కళాశాలకు స్కౌట్స్ యూనిట్ మంజూరు చేస్తున్నట్లు ఇటీవల ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు ప్రకటించారు. కార్యక్రమంలో ఏలైజర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాత్కాలిక విరామంపై హర్షం

న్యూశాయంపేట: సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించడాన్ని హర్షిస్తున్నట్లు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట ప్రకటన విడుదల కావడాన్ని స్వాగతిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కాలమాన రాజకీయ పరిస్థితుల్లో పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటంలో పాల్గొంటామని పేర్కొనడం ఆహ్వానించదగిన విషయమన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి శాంతి చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

'మైనార్టీల సంక్షేమం గాలికి..'

న్యూశాయంపేట: మైనార్టీల సంక్షేమాన్ని పాలకులు గాలికొదిలేశారని మైనార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ ఖుద్దూస్ ఆరోపించారు. హనుమకొండ సుబేదారిలోని కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చాక మైనార్టీల బతుకులు మారుతాయని భావించినా, నేటికీ అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మైనార్టీ కోసం కేటాయించిన బడ్జెట్‌ను వారికే కేటాయించాలని సూచించారు. సమావేశంలో మహ్మద్ బారి, అక్తర్, హుస్సేన్‌మియా, హమీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

48 గంటల బంద్‌ను విజయవంతం చేయాలి

వరంగల్ అర్బన్: బల్దియా కార్మికుల కనీస డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 25, 26 తేదీల్లో 48 గంటల పని బంద్‌కు సహకరించాలని సీఐటీయూ నాయకులు టి.ఉప్పలయ్య, సింగారపు బాబు కోరారు. ఈ మేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఒకపూట పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీప్లేస్‌మెంట్‌ను అమలు చేయాలని, హార్టీకల్చర్, మలేరియా, వాటర్ సప్లై కార్మికులకు జీతాలు ఇవ్వాలని కోరారు.

సంక్షిప్తంగా

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

ఖిలా వరంగల్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య సూచించారు. శంభునిపేటలో ధర్మారావు సాంబమూర్తి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో రంగయ్యతో పాటు నాయకులు సింగారపు బాబు, నలిగంటి రత్నమాల మాట్లాడారు. నాటి సాయుధ పోరాటంలో మతాల ప్రస్తావన లేదని, ప్రజలందరూ కలిసి ఐక్యంగా పోరాడిన విషయాన్ని నేటితరం తెలుసుకోవాలన్నారు. అనంతరం ప్రజానాట్య మండలి బృందం పోరాట వీధి నాటికలు ఆకట్టుకున్నాయి. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుర్గయ్య, చుక్క ప్రశాంత్, రమేష్, ఉదయశ్రీ, మంజుల, స్వాతి, షమీనా, రజిని, మల్లయ్య, ప్రకాశ్, కృష్ణ, రజియా పాల్గొన్నారు.

టర్మినేషన్ ఆర్టిజన్లను విధుల్లోకి తీసుకోవాలి

హన్మకొండ: తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారనే కారణంతో టర్మినేషన్ చేసిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి ఎ.రాము కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో టర్మినేషన్ అయిన ఆర్టిజన్లు గురువారం రాగా, సీఎండీ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌వార్డులో ఇచ్చారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఉద్యోగాలు లేక వేతనం రాక ఆ కుటుంబాలు తీవ్ర వేదనలో మగ్గుతున్నాయని, మానవత దృష్టితో ఆలోచించి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సూచించారు.

సీనియర్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి

ఖిలా వరంగల్: టెట్ నుంచి సీనియర్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ కోరారు. వరంగల్‌లో టీఎస్ యూటీఎఫ్ వరంగల్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీనియర్ టీచర్లకు శరాఘాతంగా మారిందని వాపోయారు. ఐదేళ్ల సర్వీస్ ఉన్న వారు సర్వీస్‌లో కొనసాగాలన్నా, ప్రమోషన్ పొందాలన్నా టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని తీర్పు శోచనీయమన్నారు. 20 – 25 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సీనియర్ టీచర్లకు టెట్ పాస్ కావటం అనేది చాలా పెద్ద సమస్యగా మారిందన్నారు. టెట్ ఉత్తీర్ణత మార్కుల శాతాన్ని 60 నుంచి 40కి తగ్గించాలని ఆయన కోరారు. సమావేశంలో వరంగల్ మండల అధ్యక్షుడు దుద్యాల రవీందర్, బాదావత్ శ్రీనివాస్, పొన్నం రవి, ఆవుల విజయ్, బుర్ర అశోక్, తదితరులు పాల్గొన్నారు.

28న ఆర్యవైశ్య ప్రతిభా పురస్కారాలు

నయీంనగర్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) హనుమకొండ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ఈ నెల 28న అవోపా భవనంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు అవోపా అధ్యక్షుడు దొంతుల ఈశ్వరయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య విద్యార్థులు 10వ తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు ఉన్న అన్ని కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 70930 35699 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కమటాల భాస్కర్ రావు, గంప సతీష్, గన్ను సురేందర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

క్రమంతప్పకుండా హాజరైతే ఉత్తమ ఫలితాలు

హసన్‌పర్తి: విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరైతే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ప్రిన్సిపాల్ సునీత అన్నారు. హసన్‌పర్తి మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పేరెంట్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు నిఘా వేయాలని సూచించారు. మొబైల్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి అధ్యాపకులు పలు సూచనలు చేశారు. సమావేశంలో పాఠశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి చకిలం రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల సభను విజయవంతం చేయండి

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని యూనివర్సిటీ లంబాడీ రిజర్వేషన్ ప్రొటెక్షన్ జాయింట్ యాక్షన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సభకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లుగా జేఏసీ నాయకులు వెల్లడించారు. కేయూ గేట్‌వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ కన్వీనర్ రమేష్ నాయక్, బాధ్యులు వెంకటేశ్వర్లు, అశోక్, సందీప్, కళ్యాణ్, సుధీర్, తిరుపతి, నరేష్, వీరేందర్, అనిల్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ నగరంలో, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బీజేపీ అగ్రనేత, మాజీ కేంద్ర మంత్రి దివంగత సుష్మాస్వరాజ్ క్యాంస విగ్రహాలను ఏర్పాటు చేయాలని మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, బీజేపీ నేత కె.రాజయ్య యాదవ్ కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సుష్మాస్వరాజ్ పాత్ర ఎంతో ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మంద ఐలయ్య, వంగాల సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు చదివే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత డిమాండ్‌చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు సరిపడా హాస్టల్ భవనాలు లేవని అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు బీరెడ్డి జస్వంత్, కార్యదర్శి సాయికుమార్, బాధ్యులు పరిమళ, మల్లేష్, రాహుల్, సూరజ్, ప్రవళిక, అనూష, రవళి, వైష్ణవి, భాను తదితరులు పాల్గొన్నారు.

22నుంచి పద్మాక్షి శరన్నవరాత్రి ఉత్సవాలు



నయీంనగర్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో పద్మాక్షి దేవికి ఈనెల 22 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ వేద పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగిళ్ల రామశాస్త్రి, నాగిళ్ల శంకరశర్మ, రవికుమార్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఫార్మసిస్టులు ప్రధాన భూమిక పోషించాలి



మామునూరు: రోగుల భద్రతలో ఫార్మసిస్టులు ప్రధాన భూమిక పోషించాలని వాగ్దేవి ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కమల్‌యాదవ్ సూచించారు. యువర్ సేఫ్టీ జస్ట్ క్లిక్ వే అనే అంశంపై ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఐదో జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో చెస్ట్ ఫిజీషియన్, ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్, స్లీప్ మెడిసిన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్.సురేష్ ఆధ్వర్యంలో క్లినికల్ అప్రోచెస్ ఇన్ మేనేజింగ్ ఇంటర్ స్టీషియల్ లంగ్స్ డీసీజ్, ఆరోగ్య భద్రత అనే అంశాలపై గురువారం చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు శిరీష, టి.రవి, శ్వేతాంజలి, భాగ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రోగులు వైద్యుల సలహాలు పాటించాలి

కేయూ క్యాంపస్: సాధారణంగా జ్వరం, ఇతరత్రా జబ్బుల బారిన పడినప్పుడు సొంత వైద్యాన్ని పాటించవద్దని, వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవాలని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీపతి మాట్లాడుతూ మారిన జీవనశైలితో సరైన ఆహార నియమాలు పాటించకపోవడం వలన అనేక రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రహమాన్, అధ్యాపకుడు దయాకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శ్రీదేవి, శ్రీలత, రమేష్ పాల్గొన్నారు.